క్లుప్తంగా

కేజీబీవీ దరఖాస్తుల ఆహ్వానం

పొన్నలూరు: మండలంలోని మాలపాడు కేజీబీవీలో 2023-24 విద్యా సంవత్సరానికిగాను 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి బి.సుభాషిణి శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9010638151ను సంప్రదించాలని సూచించారు.

వలంటీర్ల భర్తీకి నోటిఫికేషన్

సీఎస్‌పురం(కనిగిరి రూరల్): మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు లో 3, అంబవరం కొత్తపల్లిలో 1 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉండే అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ నెల 27 వ తేదీ నుంచి 30 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

పీసీపల్లి: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి కోరారు. శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. పెదఅలవలపాడు, తలకొండపాడు, గుంటుపల్లి, ముద్దపాడులో 1, లక్ష్మక్కపల్లిలో 2 ఖాళీలున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

150 మంది రక్తదానం

సింగరాయకొండ: జీవీఆర్ సంస్థల అధినేత దివంగత గ్రంధి వెంకటేశ్వరరావు 83వ జయంతి సందర్భంగా శుక్రవారం గ్రంధి చెల్లారావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఒంగోలు జీజీహెచ్ డాక్టర్ పి.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో కంపెనీ ఉద్యోగులు 150 మంది రక్తదానం చేశారు. ఫ్యాక్టరీ మేనేజర్ బీబీఎస్ శ్రీనివాస్, ప్రభుత్వ వైద్యుడు చైతన్యకృష్ణ, ప్రొడక్షన్ మేనేజర్ శంకర్, చెల్లదొరై, బాలాజీ, సుబ్రహ్మణ్యం, హెచ్ఆర్ మేనేజర్ ఎ.బాబూరావు, కూనపురెడ్డి సుబ్బారావు, కుర్రా సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు లాభం

టంగుటూరు: ప్రభుత్వం ప్రష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న భూ హక్కు, భూరక్ష సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహసీల్దార్ చిరంజీవి పేర్కొన్నారు. శుక్రవారం కారుమంచి గ్రామంలో భూ రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని 17 రెవెన్యూ గ్రామాలుండగా ఇప్పటి వరకు ఏడింటిలో రీసర్వే పూర్తయిందన్నారు. ప్రస్తుతం జయవరం రీసర్వే చేస్తున్నట్లు చెప్పారు. రైతులు రీసర్వే బృందాలకు సహకరించాలని సూచించారు. సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు ఆనం సత్యనారాయణరెడ్డి, సర్వేయర్, అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ సందడి షురూ

- నెలంతా సహరీ, ఇఫ్తార్‌ల ఏర్పాటుకు ప్రణాళిక
- మసీద్‌ల వద్ద హలీమ్ అమ్మకాలు


ఛోటి మసీద్ వద్ద ఏర్పాటు చేసిన హలీం అమ్మకాలు

కనిగిరి రూరల్: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ నెల శుక్రవారం నుంచి ప్రారంభమైంది. రంజాన్ తొలిరోజు, తొలి శుక్రవారం (జుమ్మా) నమాజ్ ప్రార్థనకు ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో మసీదులన్నీ కిటకిటలాడాయి. ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో నమాజ్ చదివారు. జిల్లాలోనే అత్యధికంగా ముస్లింలు ఉండే ప్రాంతాల్లో ఒకటైన కనిగిరిలో రంజాన్ సందడి ప్రారంభమైంది. పండగ శుభాకాంక్షలు తెలుపుతూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఛోటి (దర్గా) మసీదులో ఉపవాస దీక్ష దారులకు సహార్, ఇఫ్తార్‌లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా యువత అంతా కమిటీలుగా ఏర్పడి ఏర్పాట్లను చేస్తున్నారు. ఇఫ్తార్ సమయంలో ఎక్కువగా ఉపవాస దీక్షదారులు బలవర్ధకమైన, పౌష్టికాహారం తీసుకుంటారు. ఈనేపథ్యంలో ఎక్కువగా దీక్షల విరమణ తర్వాత హలీం తింటారు. దీంతో ఒంగోలు బస్టాండ్‌లోని ఛోటి మసీద్ వద్ద హలీం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పాదిలి కేంద్రంగా తయారు చేస్తూ.. కనిగిరి, మార్కాపురం, కంభం వంటి ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఎక్కువ గిరాకీ ఉండటంతో హలీం అమ్మకాల పాయింట్లు మరిన్ని పెరిగే అవకాశాలున్నాయి.

ఇష్టంతో చదివితే ఉన్నత భవిష్యత్


సింగరాయకొండ-విద్యార్థినులు ప్రదర్శిస్తున్న కోలాట కార్యక్రమం


పొన్నలూరులో విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేస్తున్న జెడ్పీటీసీ, సిబ్బంది


పామూరులో విద్యార్థులకు బహుమతులిస్తున్న డీవైఈవో

సింగరాయకొండ: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందజేసిన దేవీ సీఫుడ్స్ మేనేజర్ గిరి, డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ బి.హరిబాబును హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వరనాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తొలుత విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థినుల కోలాట ప్రదర్శన ఆహూతులను అలరించింది.

మద్దిపూడిలో టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు


మద్దిపూడిలో విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి, ఎంపీడీఓ సుదీప

మద్దిపూడి: స్థానిక జెడ్పీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని చదువులో రాణించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ సుదీపాతో కలిసి హాల్ టికెట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ కె.భాస్కర్, కోఆప్షన్ మెంబర్ కోండ్రు ఇజ్రాయిల్, పీఎంసీ చైర్మన్ డి.శివరామయ్య పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

పొన్నలూరు: చదువుకు పేదరికం అడ్డుకాదని, విద్యతోనే ప్రతి వ్యక్తికి ఉన్నత భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. శుక్రవారం పొన్నలూరు, చెన్నిపాడు జెడ్పీ పాఠశాలల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన నేలపాటి రామేశ్వరమ్మ జ్ఞాపకార్థం నేలపాటి బ్రహ్మయ్య, చందు దంపతులు రూ.6 వేల విలువైన అట్టలు, పెన్నులు, పూర్వ విద్యార్థిని ఉప్పుటూరి సుజాత రూ.5 వేల విలువైన జామెట్రీ బాక్సలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. చెన్నిపాడు హైస్కూల్లో గత ఏడాది టెన్త్ పరీక్షల్లో మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన ఎదురు భార్గవికి విప్పగుంట జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎస్.శివరామకృష్ణ రూ.5 వేలు బహుమతి అందజేశారు. ముందుగా సరస్వతీ పూజ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఎంఈఓ రవిచంద్రబాబు, హెచ్‌ఎంలు బి.వెంకట్రావు, వేణుగోపాల్‌రావు, సొసైటీ చైర్మన్ గొల్లపూడి రవణయ్య, కొండపి విశ్వేశ్వరరావు, ముళ్లమూరి వెంకటేశ్వర్లు, వెన్నపూస రమేష్‌రెడ్డి, సర్పంచ్ గుత్తి శారమ్మ పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి

పామూరు: విద్యార్థులు లక్ష్య సాధన కోసం ఇష్టంతో కష్టపడి చదివి రానున్న 10వ తరగతి వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలని డిప్యూటీ డీఈవో ఏ.చంద్రమౌళేశ్వర్ అన్నారు. బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం హెచ్‌యం సీహెచ్ బాలక్రిష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడిచదివి లక్ష్యాన్ని సాధించాలని తద్వారా భవిష్యత్ బంగారుబాటగా ఉంటుందన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమని ఆదిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు. పీసీపల్లి మండలం గుంటుపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన గుణప్రసాద్ 10వ తరగతి విద్యార్థులకు తన సొంతనిధులతో సమకూర్చిన పరీక్ష సామగ్రిని డిప్యూటీ డీఈవో చేతుల మీదుగా అందజేశారు. స్థానిక ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, పీఎంసీ చైర్మన్ ఎర్రసింగు రమేష్, జెడ్పీహెచ్ఎస్ కంబాలదిన్నె హెచ్‌ఎం యస్.కాలేషావలి, ఎల్.ఎన్.పురం హెచ్‌యం సయ్యద్ ఇసాక్, కోటపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.


వెలిగండ్ల : మాట్లాడుతున్న గుంటక తిరుపతిరెడ్డి

వెలిగండ్ల: విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ రామన మహాలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యులు గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం కొన్ని కోట్లు ఖర్చుచేసి పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి సర్వాంగ సుందరంగా తయారు చేసిందన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, సర్పంచ్ టి. సురేష్‌బాబు, ఎంఈఓ దాసుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు చిలకల వెంకటేశ్వరరెడ్డి, పొల్లా సుబ్రమణ్యం, టి. నాని, యెలికె నారాయణ, మేడం ఆదిరెడ్డి, హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీబీని అంతం చేయండి


ర్యాలీ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ


సింగరాయకొండలో ర్యాలీ..

కనిగిరి రూరల్: క్షయ వ్యాధి నివారణ అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల, టీబీ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఏ. సృజన మాట్లాడుతూ దేశంలో క్షయా వ్యాధి తీవ్రమైన ఆరోగ్య సమస్యగా ఉందన్నారు. టీబీ యూనిట్ సూపర్ వైజర్ వై. బాబురావు, వైద్యశాల సూపరింటెండెంట్ సయ్యద్ అబ్దుల్ కలాం, డాక్టర్ ప్రియా హర్షానంద, పి. కిరణ్‌కుమార్, రామాంజనేయులు, బాలుడు, కె. ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తంగా ఉండండి

సింగరాయకొండ: క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం సింగరాయకొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేసినట్లయితే ప్రాణాపాయం నుంచి రక్షణ పొందవచ్చని డాక్టర్ చైతన్యకృష్ణ అన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. జరుగుమల్లిలో సీహెచ్ఓ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

సొంతింటి కల సాకారం ప్రభుత్వ లక్ష్యం


వర్గంపల్లెలో కాలనీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ

పామూరు: పేదలకు సొంతింటికల సాకారమే లక్ష్యంగా ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంపీడీవో ఊట్ల శ్రీనివాసులు అన్నారు. వర్గంపల్లె ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను, గ్రామ సమీపంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లోని కాలనీల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. హౌసింగ్ ఏఈ ఎల్లంరాజు, ఏపీవో బి.మాల్యాద్రి, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, కార్యదర్శి జి.వి.రాజగోపాల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల కేంద్రంలో జరుగుతున్న పక్కా ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ ఎం. క్రిష్టారావు, తహసీల్దార్ ఎస్.హరిబాబు శుక్రవారం పరిశీలించారు. నిర్మాణాలు త్వరత గతిన పూర్తి చేయాలన్నారు. ఏఈ కొండయ్య, సర్పంచ్ కత్తి రాజారావు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


సామగ్రి అందిస్తున్న కస్తూరిరెడ్డి, ప్రకాశం, దాత వెంకటేశ్వర్లు

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన మెరుగైన విద్య లభిస్తుందని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. దిరిశవంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థుల వీడ్కోలు సభ శుక్రవారం జరిగింది. ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడారు. అనంతరం దాత, మానవతా సంస్థ సభ్యుడు వాగిచెర్ల వెంకటేశ్వర్లు పరీక్ష సామగ్రి అందజేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, డి. రామిరెడ్డి, హెచ్‌ఎం రాచగుండ్ల శ్రీనివాసులు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ వట్టివేళ్ల రంగారావు, ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బారావు, సేవాదళ్ అధ్యక్షుడు శ్రీహరిరెడ్డి, శ్రీనివాసులు, తాళ్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు పది పునాది

పీసీపల్లి: భవిష్యత్తుకు పదో తరగతి పునాది అని జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం అన్నారు. శుక్రవారం పెదయిర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వైభవంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. స్కూల్ చైర్మన్ సూరా మాల్యాద్రి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో మేలు

పొన్నలూరు: చిరు ధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఏరియా ఆరోగ్య అధికారి పఠాన్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. మండలంలోని మాలపాడు అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారరం చిరు ధాన్యాలు, పౌష్టికాహారం, ఆరోగ్య సూత్రాలపై గర్భిణులు, బాలికలు, చిన్నారులకు అవగాహన కల్పించారు. రాగులు, సజ్జలు తదితర చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వలన ఎముకలు పటిష్టంగా ఉంటాయన్నారు. చదువుకోవాల్సిన వయసులో చెడు వ్యసనాలు, ఆకర్షణకు లోనుకావద్దని కిశోర బాలికలకు సూచించారు. బాల్య వివాహాలతో బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో సిరిగిరి గోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సిరి ధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

పీసీపల్లి: సిరి ధాన్యాలతో ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రియారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బుడ్డారెడ్డిపల్లిలో సిరిధాన్యాలపై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంఎస్‌కే వెల్ఫేర్, అంగన్‌వాడీ ప్రతినిధులున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


మాట్లాడుతున్న సీడీపీఓ విజయకుమారి

సింగరాయకొండ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారని ఉలవపాడు సీడీపీఓ విజయకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సుందర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల్లో ప్రభుత్వం అందజేస్తున్న పాలు, గుడ్లు, రాగిపిండి, బెల్లం, చిక్కీలను సద్వినియోగించేసుకుని ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. సూపర్‌వైజర్లు రిజ్వానా, నాగలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలానికి నాణ్యమైన బేళ్లు తేవాలి


టంగుటూరులో వేలాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: రైతులు వేలానికి నాణ్యమైన బేళ్లను తీసుకురావాలని, అలాగే అన్యపదార్థాలు లేకుండా చూడాలని నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం మల్లవర్పుపాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాల రైతులు 846 బేళ్లను వేలానికి ఉంచగా 731 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.200 కాగా, కనిష్ట ధర రూ. 170, సరాసరి రూ. 195.85 పలికింది.

కొండపిలో 912 బేళ్ల కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాల రైతులు 1025 బేళ్లు తీసుకురాగా 912 కొనుగోలయ్యాయి. అత్యధిక ధర కేజీ రూ.200, అత్యల్ప ధర రూ.190, సరాసరి ధర రూ.198.85 పలికిందని నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

408 పొగాకు బేళ్ల కొనుగోలు

కనిగిరి రూరల్: కనిగిరి టుబాకో కేంద్రంలో 408 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు వేలం కేంద్ర నిర్వాహణ ఇన్‌చార్జి కోటేశ్వరరావు తెలిపారు. మాచవరం క్లస్టర్‌లోని గ్రామాలను రైతులు 437 బేళ్లు తీసుకుని రాగా, అందులో 408 బేళ్లను వివిధ కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేయగా, 29 బేళ్లను తిరస్కరించినట్లు వెల్లడించారు. మొత్తం 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 200 పలుకగా, కనిష్ట ధర రూ 170, సరాసరిధర రూ 198.54 పలికినట్లు తెలిపారు.

ముస్లింలకు శుభాకాంక్షలు

సింగరాయకొండ: రంజాన్ మాసం ప్రారంభోత్సవం సందర్భంగా ముస్లింలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మాసంలో ఎంతో నిష్టగా ఉపవాస దీక్షలు పాటించి అల్లా కృపకు పాత్రులు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

మద్దిపూడి జెడ్పీ హైస్కూల్లో ఆర్వో ప్లాంట్

- నాబార్డు నిధులు రూ.5.30 లక్షలతో ఏర్పాటు


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

మద్దిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో రూ.5.30 లక్షల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఎంపీపీ వాకా వెంకటరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలో 527 మంది విద్యార్థుల కోసం రోజూ 600 లీటర్ల నీటిని కొనుగోలు చేసేందుకు రూ.3,500 వెచ్చించాల్సి వస్తోందని, ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో సమస్య తీరిందని హెచ్‌ఎం యు.శ్రీనివాసులు పేర్కొన్నారు. పాఠశాలలో ఆటస్థలం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంపీపీని కోరగా.. 2 ఎకరాల భూమి కొనుగోలు చేసేందుకు తన సొంత నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎస్.సుదీప, సర్పంచ్ కె.భాస్కర్, కోండ్రు ఇజ్రాయిల్, నాయకులు మాచేపల్లి నాగయ్య, డి.శివరామయ్య, తూగుట్ల నర్సారెడ్డి, అలికేపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


బ్యాటింగ్ చేస్తున్న కదిరి బాబూరావు

సీఎస్‌పురం(కనిగిరి రూరల్): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని వైఎస్సార్ సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు అన్నారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శీలంవారిపల్లిలో నిర్వహిస్తున్న 21వ ఆర్‌సీసీ క్రికెట్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. క్రికెట్ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఆయన మాట్లాడుతూ పండగ సందర్భాల్లో యువత చెడు వ్యసనాల వైపు వెళ్ల కుండా క్రీడలు సన్మార్గంలో నడిపిస్తాయన్నారు. చందన పట్టాభిరామేశ్వరరావు, కె.బి.ఆర్ విద్యా సంస్థల కరెస్పాండెంట్, సెక్రటరీలు కదిరి ప్రకాశరావు, కదిరి పార్థసారధి కదిరి బాలకృష్ణ, కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్‌బీ బుజ్జి, ఉప సర్పంచ్ తీకెనం బాబూరావు, కేవీఎల్‌ఎన్ ప్లస్ 2 కళాశాల పీఎంసీ చైర్మన్ ఇరగని చలపతిరావు, మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, కె.బి.ఆర్ కళాశాల డీన్ డాక్టర్ పి. వీరన్న గౌడ్ మన్నేపల్లి రవికుమార్, తోట వెంకటేశ్వర్లు, పోకల మాల్యాద్రి పాల్గొన్నారు.

ఆర్డీఓగా అజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ


ఆర్డీఓ అజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నేతలు

కనిగిరి రూరల్: కనిగిరి ఆర్డీఓగా టి. అజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కనిగిరిలో ఆర్డీఓగా ఉన్న సందీప్ కుమార్ అన్నమయ్య జిల్లా మదనపల్లికి ఎస్‌డీసీగా బదిలీపై వెళ్లారు. నూతన ఆర్డీఓ అజయ్‌కుమార్‌ను జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం కలిసి, ఘనంగా సన్మానించారు. డివిజన్‌లోని రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ యు. పుల్లారావు, హెచ్‌ఎంల సంఘ అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓ జె. ప్రసాద్‌రావు, రెవెన్యూ సిబ్బంది, అధికారులు ఆర్డీఓను కలిసిన వారిలో ఉన్నారు.

శనగ రైతులు జాగ్రత్తలు పాటించాలి

టంగుటూరు: అకాల వర్షాలకు శనగ ఓదెలు తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ స్వర్ణలత సూచించారు. మండలంలోని మర్లపాడు, ఎం.నిడమానూరు, కందులూరు గ్రామాల్లో శనగ పంటను శుక్రువారం ఆమె పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలో సుమారు 400 ఏకరాల్లో శనగ కోశారని, గురువారం కురిసిన వర్షానికి ఓదెల అడుగున కాయల్లోని గింజలు మొత్తగా మారాయన్నారు. ఓదెలను తిరగేస్తే ఎలాంటి నష్టం ఉండదని చెప్పారు. వాతావరణాన్ని చూసి శనగ కోసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరిలో వడగండ్లవాన

కనిగిరి రూరల్: పట్టణంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. గాలుల ధాటికి చెట్లు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

రెవెన్యూ పనుల్లో జాప్యం వద్దు


వీఆర్వోల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హరిబాబు

హనుమంతునిపాడు: రెవెన్యూకు సంబంధించిన అన్ని రకరాల ఫైళ్లు పరిశీలించి ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని తహసీల్దార్ ఎస్. హరిబాబు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వీఆర్వోలకు, సర్వేయర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ వద్ద నుంచి వచ్చిన గ్రీవెన్స్ అర్జీలు కాని, తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పరిశీలించి వెంటనే పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ఆర్ఐ లావణ్య, వీఆర్ఏలు కాశీమ్ పీరా, వెంకటస్వామి, బాదుర్ల, పురుషోతం, శ్రీనివాసులరెడ్డి, చిన్నయ్య, చెన్నకేశవులు, ఆంజనేయల్, సర్వేయర్ రమణయ్య తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు వార్డుల్లో పర్యటించారు. నీటి నిల్వతో దోమలు వ్యాప్తి చెంది, రోగాలు వస్తాయన్నారు. పి. అరుణోదర్, ఖాదర్‌వలి, ఖాజా, హుస్సేన్ పాల్గొన్నారు.అలాగే స్థానిక మున్సిపల్ చాంబర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కరోనా వ్యాధి లక్షణాలపై అప్రమత్తం చేయాలని కోరారు.